క్లుప్తంగా

రైతులకు బ్యాంకు అధికారులు సహకరించాలి



తాడూరు: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ డబ్బులను బ్యాంక్ అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల ఖాతాలో జమ చేయాలని కోరుతూ బుధవారం డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు భరత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ ఖర్చులు, విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు, ట్రాక్టర్ ఖర్చులు ఇతరాత్ర ఖర్చులు ఉన్నాయని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం రిన్యువల్ డబ్బులు కడితేనే మాఫీ డబ్బులు కొత్త రుణాలు ఇస్తామని బ్యాంకులు అధికారులు మెలికలు పెడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, శివయ్య, కృష్ణారెడ్డి, యాదయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవినాయక్



పెద్దకొత్తపల్లి: లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రుడావత్ రవినాయక్‌ను బుధవారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన ఎల్‌హెచ్‌పీ జాతీయ అధ్యక్షులు రాంబాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రవినాయక్‌ను సన్మానించారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఈశ్వరయ్య మాతృమూర్తి, బలరాంనగర్ కాలనీకి చెందిన సైదులుయాదవ్ తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించారు. చైర్మన్ వెంట వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్ సైదులుగౌడ్, నాయకులు నేరటి శేఖర్, శేకర్‌గౌడ్, ఖాదర్, హసన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

ఉప్పునుంతల: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ నల్గొండ జిల్లా సూర్యాపేటకు బదిలీ అయ్యారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ సరస్వతికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానంలో సీసీఎల్ నుంచి నూతన తహసీల్దార్‌గా సునీత వస్తున్నట్లు సమాచారం.

రేపు వాహనాలు వేలం

నాగర్‌కర్నూల్ క్రైం: సారా రవాణా కేసులలో జప్తు అయిన వాహనాలను ఈ నెల 26న ఎక్సైజ్ సీఐ కార్యాలయ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ కల్యాణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో, టీవీఎస్ వాహనాలను ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

అట్రాసిటీ కేసులో ఒకరికి రిమాండ్

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్ తండాకు చెందిన గిరిజన మహిళను కులం పేరుతో దూషించి, అవమానించి దాడి చేసిన డేరంగుల వెంకటేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జూలై 19న గిరిజన మహిళా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం వెంకటేష్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



తాడూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జీహెచ్‌ఎం పర్వత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ అంశాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఆడే సాంప్రదాయ ఆటలు తిరిగి విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ సునీత మాట్లాడుతూ ఖోఖో, కబడ్డీ, బారకట్ట, వామనగుంట, దూకుడు వివిధ ఆటలు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా వెల్దండ బస్టాండ్
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్టాండ్ ఆవరణలో మూత్రశాలల దుస్థితి



బస్టాండ్ ప్రాంగణంలో ద్విచక్రవాహనాల పార్కింగ్

వెల్దండ: మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం 25 ఏళ్ల కిందట బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్ ఆవరణలో మౌలిక వసతులు కల్పనపై అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో బస్టాండ్ నిరుపయోగంగా మారింది. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో ప్రతి నిత్యం ప్రయాణికులతో బస్టాండ్ పరిసరాలు కిటకిటలాడుతోంది. బస్టాండ్‌లో మౌలిక వసతులు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 1999వ సంవత్సరంలో అప్పటి రోడ్లు, భవనాలశాఖ మంత్రి బి. గోపాల కృష్ణారెడ్డి, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి ఎన్. జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే యడ్మ కిష్టారెడ్డిలు బస్టాండ్‌ను ప్రారంభించారు. దాదాపుగా 25 ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. స్థానిక బస్టాండ్‌లో వసతులు లేక జాతీయ రహదారి కావడంతో వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్తున్న యాత్రికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో బైక్ పార్కింగ్

నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో స్థానికులు బైక్‌లను పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. ప్రతి రోజు దాదాపుగా 50 బైక్‌ల వరకు ఆవరణలో ఉంచి వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రత్యేకంగా బైక్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తే ఆర్టీసికి ఆదాయం సమకూర్చుకోవచ్చని నాయకులు పేర్కొంటున్నారు. అదే విధంగా ఆవరణంలో స్టాల్, షాపులు నిర్మిస్తే ఆర్టీసీ లాభాలు గడించవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయంతోను కనీసం మూత్రశాలలను కూడ వినియోగంలోకి తీసుకురాకుండా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు బస్టాండ్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి కనీసం నీటి వసతి కల్పిస్తే మూత్రశాలలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారికి కావడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పక్కన ఉండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

–రమేష్, ప్రయాణికుడు, రాచూర్

అధికారులు పట్టించుకోవడం లేదు



25 ఏళ్ల కిందట బస్టాండ్‌ను నిర్మించారు. ఎన్నడు కూడా బస్టాండ్ ఆవరణలోకి బస్సులు వెళ్లలేదు. జాతీయ రహదారి కావడంతో రోడ్డును దాటాలంటే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కరించాలి.

– సత్తయ్య, ప్రయాణికుడు, కంటోనిపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

వెల్దండ బస్టాండ్‌లో సమస్యలు ఉన్నవి వాస్తవమే. బస్టాండ్ ఉన్న సమస్యలను గుర్తించి నివేదిక తయారు చేశాం. ప్రయాణికుల విన్నపం మేరకు మౌలిక వసతులను కల్పించడానికి కృషి చేస్తున్నాం. బస్టాండ్‌లో పనిచేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం.

–సుభాషిణి, డిపోమేనేజర్, కల్వకుర్తి

చెడు వ్యసనాలతో అనారోగ్యం



మోటార్‌ను అందజేస్తున్న ఏపీకోర్ సంస్థ సభ్యులు

లింగాల: అటవీ ప్రాంతంలో ఉన్న చెంచులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వైద్యాధికారి శివశంకర్ సూచించారు. బుధవారం ఏపీకోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఏఓ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన ఉండాలన్నారు. సంస్థ తరపున మండలంలోని ఎర్రపెంటకు ఓపెన్ వెల్‌కు సంబంధించి 7 హెచ్‌పీ మోటారును అందజేశారు. అదేవిధంగా రాయవరం, దారారం చెంచు విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి లక్ష్మయ్య, ఎస్ఐ జగన్‌మోహన్, ఎంపీఓ కర్ణనాయక్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాషా, ఉపాధి పథకం ప్రత్యేకాధికారి మల్లేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పీడీఎస్‌యూ నాయకుల వినతి

వెల్దండ: విద్యార్థులకు పెండింగ్ ఉన్న స్కాలర్‌షిప్, ఫీరీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్, మధు, అర్జున్ బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 15 శాతం నిధులు మంజూరు చేయించాలని వారు కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అనుమతి లేకుండా సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ భవనాలను పూర్తి చేయాలని, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు.

మాచారంలో ఎల్ఈడీ వెలుగులు



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో వీధీ దీపాల ఏర్పాటు కోసం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నిధులతో గ్రామానికి 31 ఎల్ఈడీ లైట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో స్తంభాలకు లైట్లను అమర్చారు. అనంతరం గ్రామస్తులు కోరె రేణయ్య, బాలకిష్టయ్య, రామాంజనేయులు, మల్లయ్య, కృష్ణయ్య, సైదులు, రాజయ్య రామకృష్ణ, శ్రీనివాసులుతో పాటూ పలువురు మహిళలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాత మట్టి ఇళ్లల్లో నివాసం ఉండకుండా చర్యలు



చారకొండ: పాత మట్టి ఇళ్లల్లో నివాసం ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాలకు, ఎలాంటి ప్రాణ ,ఆస్థి నష్టం జరగకుండా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను, పాత విద్యుత్ స్తంభాలు, గుర్తించాలన్నారు. వన మహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సమావేశంలో అధికారులు ఎంపీఓ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రితిష్, ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎంపీడీఓగా కోటేశ్వర్

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ ఎంపీడీఓగా కే కోటేశ్వర్ బుధవారం కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడే విధులు నిర్వహించిన కోటేశ్వర్ బదిలీలో భాగంగా పానగల్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయనను నాగర్‌కర్నూల్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించింది.

బల్మూర్: మండల నూతన ఎంపీడీఓగా రాఘవులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటేషన్‌పై ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ కాగా వికారాబాద్ జిల్లా నుంచి రాఘవులు మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డితో పాటు నాయకులు, సిబ్బంది ఎంపీడీఓకు స్వాగతం పలికారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనిధి

కొల్లాపూర్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి నడిగొట్టు శ్రీనిధి అన్నారు. బుధవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల విద్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే చట్టాల గూర్తి తెలుసుకోవాలన్నారు. మాతృభాషను విస్మరించవద్దని, ఆంగ్లం, గణితంపై పట్టు సాధిస్తే చదువుల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. బాలికలు, మహిళల రక్షణకు సంబంధిచిన పలు చట్టాల గూర్చి వివరించారు. సదస్సులో గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ నిరూప, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, న్యాయవాదులు శ్రీనివాసరావు, వసంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉపేందర్, నళిని, ఎస్ఐ. గోపాల్‌నాయక్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతాం



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొల్లాపూర్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడుతామని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామాన్ని ఆయన సీపీఎం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. గ్రామానికి జీవనధారమైన వీరమ నాయిని చెరువుకు కేఎల్ఐ సింగోటం రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించాలని కోరారు. అనంతరం గ్రామంలో సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో అధ్యయనం చేశారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యపై అధ్యయనం చేసి పాలకుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శి శ్రీనివాసులుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి జల్లాపూరం సురేందర్, ఎండీ సలీం, వెంకటేష్, చంద్రయ్య, సాయికుమార్, కిరణ్‌రావు, రమేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు పరిశీలించిన ఎంపీడీఓ



తెలకపల్లి: మండల కేంద్రంలోని శ్రీనివాసా కాలనీలో అంతర్గత రోడ్లను బుధవారం ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. గుంతలమయంగా ఉన్న రోడ్లపై మొర్రం వేయించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి ఉన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

చారకొండ: మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గండె శ్రీధర్ (51) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల నాయకులు, వ్యాపారవేత్తలు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపటి సంస్మరణ సభను విజయవంతం చేద్దాం



మన్ననూర్: అచ్చంపేట పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే నామాల బాలస్వామి సంస్మరణ సభను విజయవంతం చేద్దామని కుల నిర్మూలనా పోరాట సమితి నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ ముద్దునూరి లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం మన్ననూర్‌లోని అంబేద్కర్ గ్రంథాలయం ప్రాంగణంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2001 సంవత్సరంలో నామాల బాలస్వామిని అగ్రకులస్తులు మండుతున్న గడ్డివాములో విసిరేసి సజీవ దహనానికి పాల్పడ్డారని తెలిపారు. ''దళిత మృత వీరులను స్మరించుకుందాం'' అనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇందులో భాగంగా జులై 26న అచ్చంపేట పట్టణంలో నామాల బాలస్వామి సంస్మరణ సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జయరాజ్, ప్రధాన కార్యదర్శి అభినవ్‌లు హాజరవుతారని తెలిపారు.

మంత్రికి సన్మానం



వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును బుధవారం నాయకులు సన్మానించారు. హైదరాబాద్ నుంచి వనపర్తి వెళ్తున్న మంత్రిని అదేవిధంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, సాయిరెడ్డి, వెంకటయ్యగౌడు, సంతు తదితరులు ఉన్నారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి, వెల్దండ మండలాల్లో బుధవారం విస్తృతంగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం తర్నికల్ తండా నుంచి పట్టణానికి సారా తరలిస్తున్న హర్య వ్యక్తి నుంచి ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకోని బైక్ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వెల్దండ మండలంలోని కల్యాణ వాగుతండా, రామోజీతండా, పల్లికండ్లతండాల్లో దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు హర్యను అరెస్ట్ చేశామని వివరించారు. ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

ఉప్పునుంతల: మండలంలోని తిర్మాలాపూర్‌కు చెందిన జిల్లేల మల్లారెడ్డికి సంబంధించిన ఎద్దు బుధవారం వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



పెంట్లవెల్లి: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారని కాంగ్రెస్ మండల నాయకుడు రామన్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్‌లు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డీఏ భాగస్వాములైన ఆంధ్రప్రదేశ్, బీహార్, అస్సాంలకు రాష్ట్రాలకే అధిక నిధులు కేటాయించారన్నారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా నిధులు తీసుకురావడంతో విఫలం అయ్యారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శేషాంద్రప్రసాద్, మాజీ వార్డు మెంబర్ కుమార్, శీను, నరేష్, రవిలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



చారకొండ: ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు హైదరబాద్‌లోని నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రంలో బుధవారం ఎస్ఐ రాజశేఖర్ ఆవిష్కరించారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆ సంఘం అధ్యక్షుడు తిరుపతి నాయక్ కోరారు. మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, రామకృష్ణ గౌడ్, అంజిగౌడ్, చరణ్‌రామస్వామి, తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

తెలకపల్లి: విధులను అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నముద్దునూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్‌లు సహజమేనన్నారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సాజీద్ విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు, ప్యాడ్‌లు ఇతర వస్తువులను వితరణ చేశారు. అనంతరం సాజిద్‌ను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం రాజశేఖర్‌రావు, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, రాజశ్రీ, సాయిప్రకాష్, శకుంతల, శ్రీలత, ఉమాబాయ్, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో పోడు భూములపై ఎమ్మెల్యే ప్రస్తావన

మన్ననూర్: అసెంబ్లీలో పోడు భూములపై బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రస్తావించడంపై చెంచు సేవా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా ఆదివాసీలతో పాటూ బడుగు బలహీన వర్గాల వారు పోడు భూములను సాగు చేసుకొని జీవిస్తున్నారని సభలో గళం విప్పడం సంతోషకరమన్నారు. అర్హులకు హక్కు పట్టాలు ఇవ్వడంతో పాటూ రైతుబంధు, ఇతర పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గిరిజన మంత్రి సీతక్కలకు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో పోడు సమస్యలపై మాట్లాడిన ఎమ్మెల్యేకు చెంచు సేవా సంఘం నాయకులు నాగయ్య, శ్రీనివాసులు, శంకరయ్య, పెద్దిరాజు, రాజేంద్ర ప్రసాద్, మల్లయ్య, చిర్ర రాములు, వెంకటయ్య ధన్యవాదాలు తెలిపారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల భిక్షాటన



తెలకపల్లిలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

తెలకపల్లి: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వ్యాపార, కిరాణ దుకాణాలు పలు చోట్ల గ్రామపంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ మండల అధ్యక్షుడు ఎండీ సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గోపస్ లక్ష్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 56 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు సేవలు అందిస్తున్నారన్నారు. వేతనాలు 11 నెలలుగా ఇవ్వకుండా కార్మికులను నిత్యం ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. వేతనాలు చెల్లించకపోతే ఈ నెల 30వ చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగస్వామి, మైసమ్మ, యాదమ్మ, లక్ష్మయ్య, బాలయ్య, వెంకటయ్య, రాజు, నాగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కొల్లాపూర్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో బుధవారం మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండల అధ్యక్షుడు విజయగౌడ్ కేక్ కట్ చేశారు. పట్టణంలోని వృద్ధాశ్రమంలో మాజీ ఎంపీపీ మనోహర ఆధ్వర్యంలో వృద్ధులకు బియ్యం, నిత్యవసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, పెంట్లవెల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, సూర్యప్రకాష్‌రావు, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ఈశ్వర్, మహేష్‌గౌడ్, కౌన్సిలర్ రమేష్‌రావు, కుత్బొద్దిన్, అమీనోద్దిన్, మాజీ సర్పంచ్ రాజేష్, సురేందర్‌గౌడ్, ఎస్‌కే ఖాజా, రఫియోద్దీన్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.